
రెడ్ లేడికి.. గడ్డుకాలం

- దళారుల చేతిలో బొప్పాయి రైతుల విలవిల
- రూ.20 వేల నుంచి 10వేలకు పడిపోయిన టన్ను ధర
- సిండికేట్‌ల బెడద తీరితే లాభాల పంటే


పుల్లంపేట మండలంలో సాగులో ఉన్న బొప్పాయి పంట

పుల్లంపేట : దశాబ్ద కాలంగా బొప్పాయి తినే అలవాటు గణనీయంగా పెరిగిపోయింది. డయాబెటిక్ పేషెంట్స్‌కి బొప్పాయి తినవచ్చని వైద్యులు సూచిస్తుండటంతో వినియోగం మరింత ఎక్కువ అయిందని చెప్పవచ్చు. మన ప్రాంతంలో బొప్పాయిని పండుగానే తింటాం. కానీ డిల్లీ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బిహార్, డెహ్రాడూన్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో పచ్చి బొప్పాయి కాయని కూరకి కూడా వినియోగిస్తున్నారు. దీనితో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో పండే బొప్పాయి పైరాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నది. బొప్పాయి వాడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అలాగే ప్రధాన సెంటర్లలో, బస్టాండ్ కూడళ్లలో బొప్పాయి అమ్మకాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గి తీవ్ర అనారోగ్యం పాలైనవారు బొప్పాయిని తీసుకుంటే వెంటే కోలుకుంటారని వైద్యులు సూచించడంతో బొప్పాయి కొనుగోలు విపరీతంగా పెరిగింది. ఈ ఏడాది మొదటి కటింగ్‌లో బొప్పాయి టన్ను ధర 20వేలు రుపాయలు ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రస్తుతం 10వేల రూపాయలు నిర్ణయించడంతో బొప్పాయి రైతులు లబోదిబోమని మొర్రపెట్టుకుంటున్నారు.

రెండు నియోజకవర్గాల పరిధిలో సూమారు 2 వేల హెక్టార్లలో బొప్పాయి పంట సాగులో ఉంది. ఇందులో అధికంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో సూమారు 2750 హెక్టార్లలో పంటను రైతులు సాగుచేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కోడూరులో 800, పుల్లంపేటలో 300, చిట్వేలిలో 450, పెనగలూరులో 250, ఓబులవారిపల్లెలో 400 హెక్టార్లలో బొప్పాయిను పండిస్తున్నారు. రాజంపేటలో 350 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు. ఒక ఎకరాకు 50 నుంచి 60 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. అయితే ఈ ఏడాది మొదటి, రెండు కటింగ్‌లలో టన్ను 20 వేల పలకడంతో బొప్పాయి రైతులు తమ పంట పండిదని ఆశపడేలోపు అంతలోపే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళారుల పుణ్యమా అని ప్రస్తుతం టన్ను 10వేల రూపాయలు పలకడంతో బొప్పాయి రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. గిట్టుబాటు ధర కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు నట్టేటమునిగే పరిస్థితి కలిగింది.

దళారులు, వ్యాపారులు సిండికేట్

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో బొప్పాయి వ్యాపారులు, దళారులు కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి బయట ప్రాంతాలలో టన్ను ధర 20వేల రుపాయలు ఉండగా ఇక్కడ రైతులకు టన్ను 10వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పుతున్నా రైతుల బాధలు పట్టించుకోకుండా దళారుల చెప్పిన ధరకే కొనుగోలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి దళారులతో మార్వాడిసేట్లతో బొప్పాయి వ్యాపారులు సిండికేట్ అయి టన్ను రూ.10వేలకు నిర్ణయించారు. దీనితో రైతులకు పెట్టిన పెట్టుబడులు రాని వైనం నెలకొంది. ఒక వైపు నాసిరకపు విత్తనాలు, మొలకలు రాక, అరాకొరా వచ్చిన పంటకు సిండికేట్ రూపంలో గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇకనైనా దళారుల అరాచక, మోసపూరిత సిండికేట్ వ్యవస్థకు స్వస్థిపలికి ఆరుగాలం కష్టపడి సాగుచేసి పండించిన బొప్పాయి పంటకు గిట్టుబాట ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుకుంటున్నారు.

రాజంపేట, రైల్వేకోడూరులలో బొప్పాయి సాగు	2750 హెక్టార్లలో
ఈ ఏడాది మొదట్లో టన్ను బొప్పాయి ధర	20వేలు
ప్రస్తుతం ఉన్న ధర	10వేలు
హెక్టారుకు దిగుబడి	100 టన్నులు
సరాసరి జరిగే వ్యాపారం	రూ.180 కోట్లు


బొప్పాయిని లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

దళారులను అరికట్టాలి



ఆరుగాలం కష్టించి పండించి పంట చేతికొచ్చే సమయానికి దళారులు ప్రవేశించి బొప్పాయి రైతుల నడ్డి విరుస్తున్నారు. రెండు నెల కింద టన్ను బొప్పాయి ధర రూ. 20 వేలు ఉండేది. ప్రస్తుతం రూ. 10 వేలకు పడిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం దళారులపై చర్యలు తీసుకొని గిట్టుబాటు ధర కల్పించాలి.
– టి ప్రభాకర్ రెడ్డి, రైతు, అనంతంపల్లి

ప్రతి యేడు నష్టాలు వాటిల్లుతున్నాయి



అప్పోసప్పో చేసి పంటను సాగు చేస్తే తీరా పంట చేతికి అందే సమయానికి దళారులు రంగ ప్రవేశించి రైతుల నడ్డి విరుస్తున్నారు. దీంతో పంట సాగు చేసేందుకు అయ్యే ఖర్చులు కూడా రావడం లేదు. ఓ పక్క వ్యవసాయ కూలీ ధరలు కూడా పెరిగిపోతున్నాయి. కావున ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. దళారీ వ్యవస్థ బెడదలేకుండా ప్రభుత్వమే మార్కెటింగ్ కల్పించాలి.
– సురేష్, రైతు, టి.కమ్మపల్లి

మహోన్నతుడు వాల్మీకి మహర్షి


గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి (జగదాంబ సెంటర్) : రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన మహోన్నతుడు వాల్మీకి మహర్షి అని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతారాముల సద్గుణాలను, గొప్పదనాన్ని చెప్పడంతోపాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబ విలువల నుంచి పాలనా సూత్రాల వరకు, సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియజేసిన వాల్మీకి మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. వాల్మీకులకు గత జగన్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

పంట కోతలు వద్దు

రామాపురం : ప్రస్తుతం వేరుశనగ, వరి పంటల కోత సమయాన్ని వర్షాలు కురుస్తున్న సమయంలో పంట కోతలు చేపట్టవద్దని మండల వ్యవసాయ అధికారి వై.నాగరాణి రైతులకు సూచించారు. మండలంలోని గోపగుడిపల్లి, కల్పనచెరువు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలు కోత దశలలో ఉన్నాయని, వర్షాలు పడేటప్పుడు పంట కోతలు చేపట్టవద్దని రైతులకు తెలియజేశారు. అలానే వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా కాలువల ద్వార నీటిని బయటికి పంపాలని, వరి గింజ రంగు మారకుండా ఉండేందుకు కార్బెండజిం ఒక గ్రామం, మ్యాంకోజెబ్ రెండు గ్రామాలు లీడర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి కంకులు బరువుకు చిన్నపాటి గాలితోలిన కింద పడిపోయే అవకాశం ఉందని నీళ్లు తగలకుండా వరి పంటను గుబురుగా కట్టాలన్నారు. వర్షానికి వరి కంకులు మొలకలు రాకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం కంకులపై పిచికారీ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన గురువారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు హాజరువుతారని తెలిపారు. కావున ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల ఉన్నతాధికారులు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

సిద్దవటంలో కంట్రోల్ రూమ్

సిద్దవటం : వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. మండల పరిధిలో ఏదైనా విపత్తు జరిగితే సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారికి ప్రత్యేక షెల్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులలో 90528 29514, 77020 92578 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అన్నదానం

రామాపురం : మండల పరిధి బండపల్లె వద్దల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం సుండుపల్లి గ్రామం ఈడిగపల్లెకు చెందిన జెగిలి అశోక్, సామి దంపంతుల కుమారుడు రేయాన్ యువాన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఇసుక క్వారీకి హద్దులు ఏర్పాటు


రీచ్ వద్ద తహసీల్దార్‌తో చర్చిస్తున్న మైన్స్ అధికారులు

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు వద్ద ఇసుక క్వారీ మంజూరు కావడంతో చెయ్యేరు నదిలో హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు. బుధవారం నారాయణ నెల్లూరు ఇసుక రీచ్ వద్ద తహసీల్దార్ ఇంద్రాణితో కలిసి మైన్స్ అధికారులు రీచ్ (ఇసుక ఎత్తే ప్రాంతం) గుర్తించారు. నదిలో రోడ్డు వేసి కిలోమీటర్ పైభాగాన ఇసుక తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు ఆదరణ


డ్రైవింగ్ బ్యాచ్ సభ్యులతో డీఎం రమణయ్య

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని డిపో మేనేజరు గుండాల రమణయ్య అన్నారు. డ్రైవింగ్ స్కూల్ 16 బ్యాచ్‌కు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లు పూర్తికావడం జరిగిందన్నారు. లైట్ వెహికల్ లైసెన్స్ కలిగిన 240 మందికి హెవీ వెహికల్ లైసెన్స్‌ను ఇచ్చామన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులకు హెవీ డ్రైవింగ్ స్కూల్ శిక్షణ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 99592 25775, 73828 68298, 73828 68363, 73828 68536 నంబర్లను లేదా డీఎం కార్యాలయం పనివేళలలో సంప్రదించాలన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత


భూమి పూజలో పాల్గొన్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం : ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాచపల్లె, నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లెలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజను నిర్వహించారు. మాట్లాడుతూ గ్రామాలలో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు.

డిసెంబర్ 15లోగా పూర్తి చేయాలి

సిద్దవటం : మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న రేకుల షెడ్ల నిర్మాణాలను డిసెంబర్ 15లోపు పూర్తి చేయాలని ఏపీఓ నరసింహులు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సంటిగారిపల్లె, ఎస్.రాజంపేటలో రేకుల షెడ్‌ల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ కార్యక్రమాలను చేశారు. ఏపీఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాకారంతో సంటిగారిపల్లె, గ్రామంలో బూసి వెంకటసుబ్బమ్మ అనే మహిళా పాడిరైతుకు రేకుల షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలు, ఎస్.రాజంపేట లోని నంద్యాల రామలక్షుమ్మ పాడి రైతుకు రూ.1.80 లక్షలు, పార్ల రమణమ్మకు రూ.2.30 లక్షల నిధులు మంజూరైయ్యాయన్నారు.

ఆలయాల నిర్మాణంతో భక్తిభావం


గ్రామస్తులతో కలిసి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : ఆలయాల నిర్మాణంతో సనాతన ధర్మం పెంపొందుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో మూడు రోజులు నిర్వహిస్తున్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజలలో భాగంగా బుధవారం గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికి ఆయన చేత ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు అందించారు. మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుని భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. ఆంజనేయస్వామి కృపతో వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. జగన్ హయాంలో ఆలయాల నిర్మాణాలకు పెద్దపీట వేశారని, నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేశామన్నారు.

సీజీఎఫ్ నిధులు మంజూరు అభినందనీయం

ఆలయ పునఃనిర్మాణానికి రూ.33లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరుకు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రామస్తులు దుశ్శాలువాతో సత్కరించారు.

మానవత్వం చాటుకున్నారు


యాచకులకు ఆహారం అందిస్తున్న శ్రీవారి భక్త సేవాసమితి ప్రతినిధి

రాజంపేట టౌన్ : గత మూడు రోజులుగా రాజంపేట పట్టణంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ఎవరూ బయటకు వచ్చే పరిస్థితిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో యాచకులు బయటకు వచ్చి యాచించుకునే పరిస్థితి లేని కారణంగా వారు ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని ఓ యువకుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది కాస్త వైరల్ కావడంతో శ్రీవారిభక్తసేవా సమితి రాజంపేట శాఖ ప్రతినిధులు స్పందించి బుధవారం రాత్రి ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉండే యాచకులకు ఆహారాన్ని అందించి వారి ఆకలి తీర్చారు.

అర్హులకు భూ పంపిణీ చేయాలి


పేదలతో కలసి నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అర్హులైన పేదలందరికీ సాగు భూములు ఇవ్వాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, గుట్టలు సైతం భూకబ్జాదారులు ఒక్కొక్కరు ఐదు, పది ఎకరాలు పొందారని ఆరోపించారు. కానీ మండలంలో అన్ని రకాలుగా అర్హత ఉన్న నిరుపేదలకు, దళిత బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భూ పంపిణీ చేయలేదని తెలిపారు. ప్రభుత్వం కబ్జాకు గురైన భూములను గుర్తించి వారి పట్టాలు రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు సాగు భూమిని అందించాలని లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు కె.ఓబులేశు, జి.రెడ్డి చరణ్, ఎం.నరేష్, జి.సురేష్, మహిళా కార్యదర్శులు జి.భాగ్యమ్మ, ఎం.లక్ష్మీదేవి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

చేనులో నీరు నిల్వ లేకుండా చూసుకోండి

సిద్దవటం : మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించి ఇ–పంట నమోదుపై బుధవారం సామాజిక తనిఖీ గ్రామ సభను ఏర్పాటు చేశామని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ–పంట నమోదు రైతుల జాబితా రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతు సోదరులు అప్రమత్తంగా ఉండి వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఒక వేల ధాన్యం మొలకలు వచ్చే సందర్భంలో ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, శివ ఫణీంద్ర, మాజీ ఎంపీటీసీ నాగమునిరెడ్డి, సిబ్బంది సింగరయ్య, చిన్నక్క, పల్లవి, ఐసీఆర్పీలు సుమలత, పద్మావతి, వరలక్ష్మీ, ఉప్పు లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

టమాటా ధరలు పతనం

కలకడ : కలకడ మార్కెట్‌లో బుధవారం టమాటా ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా నాణ్యమైన 15 కిలోల టమాటా బాక్స్ ధర వెయ్యి రూపాయలకు తగ్గకుండా పలకడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మచ్చలు, రంధ్రాలు పడిన సరుకును నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లలను ఓ కంట కనిపెట్టండి

రామాపురం : మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం మండల ఎస్ఐ సెల్ నెంబరు 91211 00558, లక్కిరెడ్డిపల్లె సీఐ నెంబర్ 91211 00554లకు సమాచారం అందించి సహాయం పొందాలన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అక్టోబర్ 15 నుండి 18వ తేది వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అందరికంటే ఎక్కువ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

- వరద నీళ్లలోకి వెళ్లొద్దు, ముఖ్యంగా ప్రవహించే నీళ్లకు పిల్లలను దూరంగా ఉంచండి
- వరద నీటిలో నడవకండి లేదా డ్రైవ్ చేయకండి, రెండు అడుగుల లోతున్న వరద నీరు ప్రవహించు మార్గములలో వాహనాలలో ప్రయాణం చేయరాదు. వరద నీటి ప్రవాహానికి కార్లు సైతం కొట్టుకుపోతాయి
- తడిచిన చేతులతో లేదా నీళ్లలో నిలబడి ఉంటే విద్యుత్ పరికరాలను తాకవద్దు
- తడిసిన కరెంట్ స్తంభాలకు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండండి. పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపవద్దు
- ఎడతెరిపి లేని వర్షాలకు కాలువలు, వాగులు పొంగుతాయని, వాటి వద్దకు వెళ్లకూడదు
- విద్యుత్ లైన్‌కు తగిలే చెట్లను ముట్టుకోరాదు
- తెగిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లవద్దు
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సెల్‌ఫోన్ మాట్లాడకూడదు
- విద్యుత్ మరమ్మతులు అవసరమైతే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

పశు యజమానులు జాగ్రత్తలు పాటించాలి

- పశువులు తడవకుండా చూసుకోవాలి
- వర్షాలకు గొర్రెలకు గాలికుంటు సోకే ప్రమాదం

రాజంపేట రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పశు యజమానులు జాగ్రత్తలు పాటించాలని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ కోరారు. మండల పరిధిలోని హెచ్.చెర్లోపల్లి, పెద్దకారంపల్లి, మందపల్లి, పులపుత్తూరు, ఊటుకూరు గ్రామాలలోని పశు యజమానులకు బుధవారం డాక్టర్ ప్రతాప్ మెళకువలను తెలియజేశారు. పశువుల మేతను తడవకుండా భద్రపరుచుకోవాలని లేకుంటే బూజు పడుతుందన్నారు. వర్షంలో పశువులను మేతకు వదలవద్దని తెలియజేశారు. పశువులు వర్షంలో తడిస్తే శరీర ఉష్ణోగ్రతలు తగ్గిపోయి జబ్బు పడి చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా దూడలు, గొర్రెలను తడవకుండా జాగ్రత్తపడాలని కోరారు.


లక్కిరెడ్డిపల్లె: నట్టల నివారణ మందులు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి పిళ్లై

ఈ కార్యక్రమంలో పశువైద్యాదికారులు డాక్టర్ శరత్ కుమార్‌రెడ్డి, కె.భాగ్యావతి, జేవీఓ ఎం.వరదయ్య, ఎల్ఎస్ఏ ఎం.రమేష్, టి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందులు..

లక్కిరెడ్డిపల్లి : గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పక తాపించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం, వంకగడ్డ రాచపల్లిలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనంతరం గొర్రెలు, మేకలు పెంపకందార్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు గాలికుంటు వ్యాధులు సోకే అవకాశం ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. మరెన్ని వివరాలకు పశువైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మాలకొండయ్య, బెనర్జీ, మహేష్, శాంతి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులు ఈ చర్యలు చేపట్టాలి

చిట్వేలి : అధిక వర్షాలు వల్ల ఉద్యాన పంటలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను ఉద్యానశాఖ అధికారిణి ఆషియా వివరించారు. ఆమెతో పాటు వ్యవసాయ అధికారి సందీప్ కెజెస్ అగ్రహారంలో పసుపు పంటను పరిశీలించారు. పసుపు పంటలో చేరిన వర్షపు నీరు బయటకు పంపాలని, వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు 0.5 పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. పొలంలో నిలిచి ఉన్న అదనపు నీటిని తీసివేసి నేల ఆరిన తరువాత మొక్కలు బాగా పెరగడానికి ఎకరాకు 50 కిలోల యూరియా, 40 కిలోల ఎంఓపీ, 250 కిలోల వేప పిండి ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. అలాగే బొప్పాయి, అరటి, మామిడి, కూరగాయల తోటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

మూడు నియోజకవర్గాల పరిధిలో వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. గత రెండేళ్లు వర్షాలు ఆశించిన మేర లేకపోవడంతో పలువురు రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కాగా పలు మండలాల్లో పంట నేలకొరిగింది. రేపు కూడా భారీ వర్ష సూచన ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్


రాజంపేట రూరల్: పోలీలో మునిగిన వరి పంట


పెనగలూరు: మండల కేంద్రంలో నిల్వ ఉన్న నీరు


సంబేపల్లె: కురుస్తున్న వర్షం


రాజంపేట: పరిస్థితిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్


చిట్వేలి: పసుపు పంట పరిశీలనలో అధికారులు


వీరబల్లి: జేసీబీ తో కంప తొలగిస్తున్న అధికారులు


పుల్లంపేట: పంటకాలువలోకి చేరిన నీరు

పోలీ చెరువుపైనే గంపెడాశలు

- చెరువు నిండకుంటే తాగు, సాగునీటికి ఇక్కట్లే
- రెండు రోజులుగా రాజంపేటలో వానలు
- అయినా చెరువులోకి చేరని వరదనీరు


వర్షాలు కురుస్తున్న నీళ్లు లేక బోసిపోయిన పోలీ చెరువు

రాజంపేట టౌన్ : బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం వల్ల ఈనెల 14వ తేదీ నుంచి అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ గత వారం రోజులుగా ప్రకటిస్తూ వస్తోంది. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏయే జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్న విషయాలను వాతావరణశాఖ వెల్లడించింది. అన్నమయ్య జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అందుకు తగ్గట్లు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. దీంతో రాజంపేట ప్రాంత ప్రజలు, రైతులు బాగా వర్షాలు కురిసి చెరువుల్లోకి భారీగా వర్షం నీరు చేరుతుందని ఎంతో ఆశపడ్డారు. అయితే రాజంపేటలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో ఇటు రైతులు అటు ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2021వ సంవత్సరం నవంబర్‌లో కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలో అన్ని చెరువులు నిండి అలుగులు పొర్లాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో నీరు లేక బీడుపోయి ఉన్నాయి. ఈ కారణంగా మండలంలో అనేక గ్రామాల్లో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికే భూగర్భ జలాలు చాలావరకు అడుగంటి పోవడంతో అల్పపీడనం వల్ల సంవృద్ధిగా వర్షాలు కురిసి మళ్లీ చెరువులు నిండి అలుగులు పార్లుతాయని గంపెడాశతో ఉన్న ప్రజలకు, రైతులకు గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు నిరాశనే మిగిల్చాయి. మండలంలో అతి పెద్ద చెరువు అయిన పోలి చెరువు నిండితే రెండు సంవత్సరాల పాటు భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవు. పోలి చెరువుతోపాటు కృష్ణమ్మ చెరువు, ఆకేపాడు, మన్నూరు, ఊటుకూరు, హస్తవరం, తాళ్లపాక చెరువుల్లోకి కూడా నీళ్లు రాకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

నేడు కురిసే వర్షంపైనే ఆశలు

ఈనెల 17వ తేదీ అన్నమయ్య జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో అందరి ఆశలు గురువారం కురిసే వర్షంపైనే ఉన్నాయి. అన్నమయ్య జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే చెరువులు నిండే అవకాశం ఉంది. లేకుంటే మళ్లీ మరో అల్పపీడనం, తుపాను పైన ప్రజలు, రైతులు ఆశలు పెట్టుకోవాల్సి వస్తుంది. నవంబర్ దాటితే వర్షాలు కూడా కురిసే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ ఏడాదిలోపు భారీ వర్షాలు కురిసి చెరువులు నిండి అలుగులు పార్లకుంటే వచ్చే ఏడాది వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అందువల్ల గురువారం ఏ మేరకు వర్షం కురుస్తుందో నన్న ఆతృత రాజంపేట వాసుల్లో నెలకొంది.